సాక్షి
ఖమ్మం

సోమవారం । 17 । మార్చి । 2025





**మక్కల కొనుగోళ్లకు రెడీ..**

యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. 8లో

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ (సోమవారం సా॥) 6.25

సహర్ (మంగళవారం ఉ॥) 4.58

**వాతావరణం**

గరిష్ఠం / కనిష్ఠం 40° / 21°

జిల్లాలో సోమవారం ఉదయం ప్రారంభమయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. ఉదయం, రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

# గ్రీవెన్స్.. గిరగిరా!

కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన గ్రీవెన్స్‌లో చాలా దరఖాస్తులు గిరిగిరా తిరుగుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. ఎన్నిసార్లు దరఖాస్తులు ఇచ్చినా ఎక్కడి సమస్య అక్కడే ఉంటోందని బాధితులు ఆవేదన చెందుతున్నారు. గ్రీవెన్స్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనీసం క్షేత్ర స్థాయి పరిశీలనకు కూడా తమ దరఖాస్తులు రావడం లేదని వాపోతున్నారు. ప్రధానంగా గ్రీవెన్స్‌కు భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. గతేదాది జనవరి 1 నుంచి ఈ ఏడాది మార్చి 10 వరకు ఈ దరఖాస్తులను పరిశీలిస్తే 1,084 పెండింగ్‌లో పెట్టారు. అయితే సమస్య పరిష్కారం కాక, ఇచ్చిన దరఖాస్తు ఎక్కడ ఉందో తెలియక చాలా మంది మళ్లీ అదే సమస్యపై గ్రీవెన్స్‌కి వచ్చి విన్నవించడం షరామామూలైంది. ఇక గతేదాది ఆగస్టులో ప్రారంభమైన మండల స్థాయి ప్రజావాణిలో 183 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

**సమస్యలు పరిష్కారం కాక బాధితుల ఆందోళన**

- దరఖాస్తులు ఇవ్వడం.. ఆపై ప్రదక్షిణలు
- కలెక్టరేట్‌లో 14 నెలల్లో 1,084 దరఖాస్తుల పెండింగ్
- మండల స్థాయి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నా అదే పరిస్థితి



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో కలెక్టరేట్ ప్రజావాణిలో రద్దీ (ఫైల్)

**ప్రతీ వారం కిటకిటే..**

ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనికి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, అన్ని శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారు. మండల స్థాయిలో తమ గోడు వెల్లబోసుకున్నా పరిష్కారం కాని సమస్యలపై బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కిటకిటలాడుతోంది. వందల సమస్యలు ఈ ప్రజావాణిని తాకుతున్నాయి. ఇక్కడ కొన్నింటిని వెంటనే పరిష్కరిస్తున్న ఉన్నతాధికారులు.. క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన వాటిని ఆయా మండలాలకు పంపుతున్నారు. అయితే అక్కడికి వెళ్లే దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం లేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. చేసేదేమీ లేక మళ్లీ ఉన్నతాధికారులకు సమస్యను నివేదించేందుకు వస్తున్నామని చెబుతున్నారు.

**భూ సమస్యలే అధికం..**

జిల్లా వ్యాప్తంగా అత్యధిక మంది ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలపైనే ఫిర్యాదులు ఇస్తున్నారు. ఏడాది కాలంలో రెవెన్యూ సంబంధిత సమస్యలపై 1,876 మంది ఫిర్యాదు చేయగా.. 1,141 దరఖాస్తులను డిస్పోజ్ చేశారు. 51 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయి. 684 దరఖాస్తులు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. భూ సమస్యలు కొన్ని సంక్లిష్టంగా ఉంటుండగా పరిష్కారానికి కొంత సమయం పడుతోంది. తమ భూమి ఆక్రమించారని, పాస్‌బుక్‌లో పేరు నమోదు కాలేదని, తన భూమిని వేరే వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. ఇలాంటి సమస్యలు అధికంగా వస్తున్నాయి. వాటిని ఆయా తహసీల్దార్లకు పంపిస్తుండగా అక్కడ పరిష్కారం కాకపోవడంతో విసుగెత్తిన బాధితులు ఆందోళనకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది మార్చి 10 వరకు కలెక్టరేట్ ప్రజావాణికి అందిన దరఖాస్తుల పరిస్థితి**

| శాఖ | మొత్తం | డిస్పోజ్ | ఫార్వర్డ్ | పెండింగ్ |
|---|---|---|---|---|
| 36 శాఖలు | 1,304 | 936 | 42 | 326 |
| రెవెన్యూ | 1,876 | 1,141 | 51 | 684 |
| ఎంపీడీఓలు | 462 | 376 | 12 | 74 |
| మొత్తం | 3,642 | 2,453 | 105 | 1,084 |

**కలెక్టరేట్ నుంచి ఎండార్స్ చేసిన దరఖాస్తుల్లో ఎక్కువ పెండింగ్‌లో ఉన్న తహసీళ్లు**

| తహసీల్ | దరఖాస్తులు |
|---|---|
| ఖమ్మంఅర్బన్ | 123 |
| కూసుమంచి | 73 |
| రఘునాథపాలెం | 60 |
| తిరుమలాయపాలెం | 28 |
| పెనుబల్లి | 28 |
| కల్లూరు | 27 |
| వేంసూరు | 25 |

**పెండింగ్‌లో 1,084 అర్జీలు..**

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 14 నెలల్లో వచ్చిన 3,642 అర్జీలకు 2,453 పరిష్కారం కాగా.. 1,084 పెండింగ్‌లో ఉన్నాయి. అయితే కొన్ని శాఖలకు సంబంధించి అసలే పరిష్కారం కాకపోవడం గమనార్హం. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ (తెలంగాణ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కి 17 అర్జీలు రాగా.. అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. టీజీఎస్ ఆర్టీసీకి వచ్చిన 12 దరఖాస్తులదీ అదే పరిస్థితి. దేవాదాయ శాఖలో 7 ఫిర్యాదులు రాగా..రెండే పరిష్కారమయ్యాయి. స్టేట్ ఆడిట్‌కు సంబంధించి రెండుకు రెండు, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ)లో 38 దరఖాస్తులకు 35, ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో 123 దరఖాస్తులకు 90, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో 157కు 123, కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో 86కు 73, సింగరేణిలో 23 దరఖాస్తులకు 19 పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది కాలంలో 20లోపు వచ్చిన దరఖాస్తులను కూడా పరిష్కరించకపోవడం గమనార్హం.

**మండలాల్లోనూ అదేతీరు**

స్థానికంగా మండలాల్లో పరిష్కారం కావాల్సిన అనేక సమస్యలపై ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిని గమనించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గతేదాది ఆగస్టు నుంచి మండల స్థాయి సమస్యలను అక్కడే పరిష్కరించేందుకు మండలాల్లో ప్రజావాణిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని 21 మండలాల్లో 994 ఫిర్యాదులు రాగా.. 811 పరిష్కరించారు. 183 పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూకి సంబంధించి 657 దరఖాస్తులు రాగా.. 558 దరఖాస్తులు పరిష్కారం అయ్యాయి. 99 పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఇతర శాఖలకు సంబంధించి 337 దరఖాస్తులు రాగా.. 253 పరిష్కారం అయ్యాయి. 84 పెండింగ్‌లో ఉన్నాయి.

**కారణం తెలియక..**

కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి మొక్కుబడి కార్యక్రమంగా మారిందనే చర్చ సాగుతోంది. ప్రతి సోమవారం ఫిర్యాదుదారులు రావడం, అధికారులు దరఖాస్తులు స్వీకరించడం మామూలైంది. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పలు ప్రజావాణి కార్యక్రమాల్లో పాల్గొని అర్జీలను స్వీకరించి.. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకుంటే ఆ విషయాన్ని దరఖాస్తుదారుడికి తెలపాలి. కానీ దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు.. సంబంధిత కార్యాలయాలకు పంపడంతోనే సరిపోతోంది. అక్కడ దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకోవడం ఫిర్యాదుదారులకు తలకు మించిన భారమవుతోంది.

గొల్లగూడెంలో ప్రవహిస్తున్న మురుగు నీరు



సాక్షి ఫోకస్

# విలీనం.. బలహీనం!

మున్సిపాలిటీల్లో విలీనమైతే అభివృద్ధితో పాటు అన్ని సౌకర్యాలు అందుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశించారు. కానీ వారి కలలు కల్లలే అయ్యాయి. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు వైరా, మధిర మున్సిపాలిటీల్లో కలిసిన గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. ఆయా గ్రామాల్లోని సమస్యలపై 'సాక్షి' క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా పలు సమస్యలను స్థానికులు వివరించారు. గతంలో పంచాయతీ పాలకవర్గాలైనా తమకు అందుబాటులో ఉండేవని, ఏదైనా సమస్య వస్తే వారు పరిష్కరించేవారని, కానీ ఇప్పుడు ఎవరికి చెప్పాలో కూడా తెలియడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లా కనెక్షన్ ఉన్నా తాగునీరు రావడం లేదని, రోడ్లు మురుగునీరు, చెత్తతో దుర్గంధం వెదజల్లుతున్నాయని వాపోతున్నారు. వీధిలైట్లు పోతే పట్టించుకునేవారు లేక అంధకారంలోనే మగ్గుతున్నామని చెబుతున్నారు. మున్సిపాలిటీ స్థాయిలో అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నా సౌకర్యాలు మాత్రం శూన్యమని అంటున్నారు.

- కథనాలు 9లో

# ప్రజా సమస్యలపై పోరాడాలి

**బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు మాజీ మంత్రి పువ్వాడ సూచన**



ముస్లింలకు ఖర్జూర తినిపిస్తున్న అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్ : బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండాలని, పాలకవర్గ సమావేశాల్లో ప్రజా సమస్యలను లేవనెత్తాలని అన్నారు. ప్రతిపక్ష పాత్ర పటిష్టంగా పోషించి నగరాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్పొరేటర్లకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని, ఎవరి బెదిరింపులకూ భయపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, ఎస్‌కే.మక్బూల్‌ను పువ్వాడ అభినందించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఇఫ్తార్ విందులో..**

ఖమ్మం ఖిల్లా మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో అజయ్‌కుమార్ పాల్గొన్నారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లిం మైనారిటీలు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కమర్, కార్పొరేటర్ మక్బూల్, షౌకత్ ఆలీ, నాగండ్ల కోటేశ్వరరావు, బిక్కసాని జస్వంత్, నజీముద్దీన్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు తాజుద్దీన్ పాల్గొన్నారు.

## రామయ్యకు ముత్యాలు బహూకరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి తెలంగాణ దేవాదాయ ట్రిబ్యునల్ చైర్మన్, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి మండా వెంకటేశ్వర్లు ఆదివారం ముత్యాలు బహూకరించారు. ముందుగా ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.1.30 లక్షల విలువైన 500 గ్రాముల ముత్యాలను ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. ఆలయ అధికారులు న్యాయమూర్తికి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో సాయిబాబు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

**న్యూస్‌రీల్**

## 'రాజీవ్ యువ వికాసానికి' దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: గిరిజన యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆసక్తి గల గిరిజన నిరుద్యోగులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈనెల 17 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతర వివరాలకు 94928 06325, 98485 22841 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని, లేదా తమ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ సంప్రదించవచ్చని తెలిపారు.

## జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక



జావాలిన్ త్రో విసురుతున్న బాలుడు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్–16, 20, సీనియర్ పురుషుల, మహిళల విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన వారిని ప్రకటించారు. అండర్–16 బాలుర జట్టులో వి.చరణ్‌గౌడ్(కొణిజర్ల), ఆర్. భరత్ (పాతర్లపాడు), అండర్–20 బాలుర విభాగంలో ఎ.గౌతమ్(వైరా), డి.వివేక్‌చంద్ర(పాలేరు), ఎస్.గోపి(ఖమ్మం), బి.వీరభద్రం(ఖమ్మం), పురుషుల విభాగంలో వి.వేణు, ఎం.మురళి(కుంచపర్తి), అండర్–20 బాలికల విభాగంలో డి.బిందు (ఖమ్మం), జె.నవ్య(వల్లాపురం), మహిళల్లో ఎ.మైథిలి(ఖమ్మం) ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మందుల వెంకటేశ్వర్లు, కోచ్ ఎండీ. గౌస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన 'స్వేచ్ఛ'



స్వేచ్ఛ నాటికలో ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన 'స్వేచ్ఛ' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. పరమాత్మ శివరాం రచించిన ఈ నాటికకు బీఎం రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో సాంస్కృతిక రంగం పాత్ర విశేష మైందన్నారు. మిత్ర గ్రూపు చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, ఎంఏ జబ్బార్ తదితరులు మాట్లాడుతూ నెల నెలా వెన్నెల కార్యక్రమాలను కొనియాడారు. ఆర్ట్స్ సంస్థ కార్యదర్శి ఏఎస్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య కల్యాణ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో 'మేధ'స్సు పెంచేలా...

**ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధన**

- పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలోని ఏడు పాఠశాలల్లో అమలు..
- ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న కలెక్టర్
- ఇటీవల రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థికి అభినందనలు



ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ పాఠశాలలో ఏఐ ఆధారిత బోధనను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత కాలంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ – కృత్రిమ మేధ)కి ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ క్రమాన విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ఈ విధానంలో బోధన చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఏడు పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనను గత నెల 24 నుంచి పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. విద్యార్థులకు కొనసాగుతున్న ఈ బోధనపై ఈనెల 11న హైదరాబాద్‌లో అధికారులకు శిక్షణ ఏర్పాటుచేయగా... జిల్లా విద్యార్థి అనర్గళంగా మాట్లాడడంతో అభినందనలు దక్కాయి. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్.. ఏఐ బోధనపైనా శ్రద్ధ చూపుతుండడంతో సత్ఫలితాలు రావడం మొదలైందని చెబుతున్నారు.

**70 మంది విద్యార్థులకు..**

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగానికి కూడా ఉపయోగించుకుని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఏఐని ఉపయోగిస్తోంది. జిల్లాలో ఏఐ బోధనకు ఏడు పాఠశాలలు ఎంపిక కాగా.. ఇందులో ఎఫ్‌ఎల్‌ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ)లో కొంత బలహీనంగా ఉన్న విద్యార్థులను ఎంపిక చేశారు. పాఠశాలకు 10మంది చొప్పున మొత్తం 70 మందికి ఏఐ ద్వారా బోధిస్తున్నారు. దీని ద్వారా వారు ఒకటికి నాలుగు సార్లు ప్రాక్టీస్ చేసి అర్థం చేసుకునే వీలుంటుంది. ఆపై ఇతర విద్యార్థులతో సమానంగా సబ్జెక్ట్‌పై పట్టు సాధించనున్నారు.

**వారానికి 40 నిమిషాలు..**

విద్యార్థులకు వారానికి 40 నిముషాల చొప్పున ఈ ఏఐ విధానంలో బోధన సాగిస్తున్నారు. ఇవి 20 నిమిషాల చొప్పున రెండు సెషన్‌లు ఉంటాయి. 20 నిమిషాలు తెలుగు, 20 నిమిషాలు మ్యాథ్స్ ప్రస్తుతం బోధిస్తున్నారు. ఆ తర్వాత మిగిలిన సబ్జెక్ట్‌లు కూడా బోధించనున్నారు. విద్యార్థులు తమకు అర్థమయ్యే వరకు ఈ సబ్జెక్ట్‌లను నేర్చుకునేందుకు ఏఐ విధానంలో అవకాశం ఉంటుంది. తెలుగు, ఇంగ్లిష్ అనర్గళంగా మాట్లాడడంతో పాటు గణితంపై పట్టు సాధించేందుకు ఏఐ దోహదపడుతుంది. ఇక్కడ జరుగుతున్న బోధన అనుకూల ఫలితాలిస్తే మిగిలిన పాఠశాలల్లోనూ ప్రవేశపెట్టనున్నారు.

**త్వరలోనే కంప్యూటర్లు, సామగ్రి**

జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా సత్తుపల్లి మండలంలోని సిద్ధారం ఎంపీయూపీఎస్, సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్ ఎంపీపీఎస్, ఖమ్మంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ పాఠశాల, రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల, పాండురంగాపురం ఎంపీపీఎస్, మల్లెమడుగు ఎంపీపీఎస్‌తో పాటు నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెం స్కూల్‌లో ఏఐ ఆధారిత బోధన మొదలైంది. ఈ పాఠశాలలకు రెండు, మూడు రోజుల్లో అదనంగా కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర సామగ్రి అందించనున్నట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ తెలిపారు. ఈనెల 20లోగా ఇవి పాఠశాలలకు చేరనుండడంతో బోధన ఊపందుకుంటుందని భావిస్తున్నారు.

**సత్తా చాటిన జిల్లా విద్యార్థి..**



నేర్చుకున్న అంశాలను అధికారి సమక్షంలో వెల్లడిస్తున్న పవన్ సాయి

ఏఐ బోధన సాగుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు నేర్చుకున్న విధానంపై మంచి స్పందన వచ్చింది. దీంతో ఇతర జిల్లాల అధికారులకు కూడా ఈనెల 11న హైదరాబాద్‌లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లాలోని నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలోని ఎంపీపీఎస్‌లో 4వ తరగతి చదువుతున్న పవన్‌సాయి పాల్గొన్నాడు. సాయిని స్టేజీపైకి పిలవగా.. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ తెలంగాణ (ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ జి.రమేష్.. ఇన్నాళ్లు ఏం నేర్చుకున్నావని ఆరా తీశారు. దీంతో విద్యార్థి నేర్చుకున్న అంశాలను స్పష్టంగా చెప్పడంతో అభినందనలు దక్కాయి. కాగా, జిల్లా నుంచి డీఈఓ సోమశేఖరశర్మ, ఏఎంఓ రవికుమార్‌తో పాటు మరో ముగ్గురు కూడా పాల్గొన్నారు.

## కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.21, 945



జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 339 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.11,625, 250 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.10, 320 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు టెస్టులు

గుండాల: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను మోడల్ స్పోర్ట్స్ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు కాచనపల్లిలో ఫిజికల్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేస్తారని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కిన్నెరసాని, కాచనపల్లి, బోయినపల్లి మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాల కోసం సోమవారం కాచనపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తారని, అవకాశాన్ని నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తీసుకురావాలని, టీషర్టుతో హాజరు కావాలని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### స్నేహితుడి పాడే మోసిన మాజీ ఎంపీ



శివ పాడే మోస్తున్న మాజీ ఎంపీ సురేశ్

ఎర్రుపాలెం: మండల కేంద్రానికి చెందిన కూరగాయల వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు జానకి వెంకటశివ (45) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఆదివారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితుడు, ఏపీ రాష్ట్రానికి చెందిన బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్.. పాడే మోశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి తోపాటు బండారు నర్సింహారావు, చావా రామకృష్ణ పాల్గొన్నారు.

### విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ కోరారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి ఎన్నో చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించడం లేదని, దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని వాపోయారు. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, దీనిని అమలు చేయాలన్నారు. సమీకృత గురుకులాల ఏర్పాటు ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేయడమేనని రామకృష్ణ ఆరోపించారు. సమావేశంలో లక్ష్మణ్, మధు, శివనాయక్, మనోజ్, గోపి, ప్రతాప్, నరేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### లోక్యాతండాలో ముగిసిన హోలీ



రంగోలిలో పాల్గొన్న తండా వాసులు

కూసుమంచి: మండలంలోని లోక్యాతండాలో మూడు రోజుల హోలీ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. తండాలో రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. తండావాసులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, డప్పులు వాయిస్తూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. మహిళలు సైతం నృత్యం చేస్తూ సందడి చేశారు.

### దేవాలయాల నిర్మాణాలకు విరాళం



నరేశ్ చౌదరిని సత్కరిస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని మద్దిగూడెం, తాళ్ల గూడెం, కెప్టెన్‌బంజర గ్రామాల్లోని దేవాలయాల నిర్మాణాలకు మద్దిగూడెం గ్రామానికి చెందిన డీఎస్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దిరిశాల నరేశ్‌చౌదరి ఆదివారం కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. కెప్టెన్‌బంజరలోని శ్రీ రామాలయంలో ధ్వజస్తంభానికి, మద్దిగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి తొలుత రూ.3 లక్షలు కమిటీ సభ్యులకు అందజేశారు. తాళ్లగూడెంలో శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని చెప్పి కమిటీ సభ్యులకు రూ.2 లక్షల నగదును అందజేశారు. దీంతో గ్రామస్తులు దాత నరేశ్‌చౌదరిని సత్కరించారు. కార్యక్రమంలో దిరిశాల ధనమ్మ, తోటకూరి శివయ్య, నల్లమోతు లక్ష్మయ్య, నల్లమోతు వెంకటనర్సయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పేకాటస్థావరంపై దాడి

ఎర్రుపాలెం: మండలంలోని కాచవరం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా మొర్సుమల్లి గ్రామానికి చెందిన ఆరుగురు కాచవరం సమీపంలో పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.20,871 |

# మక్కల కొనుగోళ్లకు రెడీ..

- మార్క్‌ఫెడ్ ద్వారా రెండు జిల్లాల్లో కేంద్రాల ఏర్పాటు
- వచ్చేనెల రెండో వారం నుంచి కొనుగోళ్లకు సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 1.27లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు



సాగులో ఉన్న మొక్కజొన్న పంట (ఇన్‌సెట్) ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చిన మొక్కజొన్న రాశులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంట కొనుగోళ్లకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా మక్కల కొనుగోళ్లకు ప్రభుత్వం నిర్ణయించగా.. సీజన్ సమీపించడంతో మార్క్‌ఫెడ్ రాష్ట్ర అధికారులు ఇటీవల జిల్లాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. పంట సాగు చేసిన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల గుర్తింపు, రవాణా తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదే సమయాన కొనుగోలు చేసిన పంట రవాణాకు సంబంధించి గత విధానం కాకుండా ఆన్‌లైన్ టెండర్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.

**అత్యధికంగా జిల్లాలో...**

రాష్ట్రంలో మొక్కజొన్న యాసంగి పంట సాగు విస్తీర్ణం అధికంగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం కూడా ఒకటి. మొక్కజొన్నలను ప్రధానంగా కోళ్ల పరిశ్రమల్లో దాణాగా వినియోగిస్తుంటారు. అయితే, ఇటీవల కోళ్లకు వైరస్ వ్యాపిస్తోందని పరిశ్రమల యజమానులు వాటి ఉత్పత్తిని తగ్గించడంతో ప్రైవేట్ మార్కెట్‌లో మక్కల ధరపై సందిగ్ధత నెలకొంది. కాగా, ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మక్కలకు క్వింటాకు రూ. 2,225గా మద్దతు ధర నిర్ణయించింది. కానీ ప్రైవేట్ మార్కెట్‌లో క్వింటా ధర రూ.2,150 మించకపోగా, భవిష్యత్ పరిస్థితి ఏమిటో తెలియడం లేదు. దీంతో రైతులకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**గత ఏడాదితో పోలిస్తే ఎక్కువే..**

ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.27 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. నీటి వనరుల ఆధారంగా ఖమ్మం జిల్లాలో 94 వేల ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 33 వేల ఎకరాల్లో పంట వేశారు. గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 80 వేల ఎకరాల్లో పంట సాగైతే ఈ ఏడాది మరో 50 వేల ఎకరాల్లో సాగవడం విశేషం. వానాకాలం కురిసిన వర్షాలతో జలాశయాల్లో నీరు ఉండడం, జిల్లాకు ప్రధాన నీటి వనరైన నాగార్జునసాగర్ నుంచి యాసంగి పంటలకు నీరు విడుదల కావడంతో వరి, మొక్కజొన్న పెద్దమొత్తంలో సాగు చేశారు. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల, చింతకాని, బోనకల్, వైరా, ముదిగొండ, మధిర, ఎర్రుపాలెం, తిరుమలాయపాలెం, ఏన్కూరు, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, కూసుమంచి తదితర మండలాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టేకులపల్లి, ఇల్లెందు, గుండాల, పాల్వంచ, చండ్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, బూర్గంపాడు తదితర మండలాల్లో మక్క పంటను వేశారు. ఏప్రిల్ మొదటి, రెండో వారం నుంచి పంట చేతికందే అవకాశం ఉంది.

**రైతులకు అందుబాటులో ఉండేలా...**

ఉమ్మడి జిల్లాలో పంట సాగైన ప్రాంతాల ఆధారంగా రైతులకు సౌకర్యంగా ఉండేలా మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గత ఏడాది ఖమ్మం జిల్లాలో 34 కేంద్రాలు ఏర్పాటు చేసి 64,413 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి జిల్లాలో ఐదు కేంద్రాల ద్వారా 3,344 మెట్రిక్ టన్నుల మక్కలను కొనుగోలు చేశారు. ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం పెరగడతో ఖమ్మం జిల్లాలో 45 – 50 వరకు, భద్రాద్రి జిల్లాలో 15 కేంద్రాల వరకు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.


**సన్నాహాలు చేస్తున్నాం...**



యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంట కొనుగోళ్లకు సమాయత్తమవుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో పంట రవాణాకు ఆన్‌లైన్ టెండరింగ్ విధానంపై దృష్టి సారించాం. పంట సాగు ఆధారంగా అక్కడ కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తాం.

– సునీత, మార్క్‌ఫెడ్ మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

## ట్యాంకర్ బోల్తా



ట్యాంకర్ నుండి వెలువడుతున్న దట్టమైన పొగ

దమ్మపేట: హైడ్రోజన్ క్లోరైడ్ ద్రావణంతో వెళ్తున్న ట్యాంకర్ బోల్తాపడిన ఘటన మండలంలోని గట్టుగూడెం శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని రాజమండ్రి నుంచి సత్తుపల్లి వైపునకు హైడ్రోజన్ క్లోరైడ్ ట్యాంకర్ వెళ్తోంది. ఈ క్రమంలో లారీ గట్టుగూడెం శివారుకు చేరుకోగా ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. లారీడ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా ట్యాంకర్‌లో ఉన్న హైడ్రోజన్ క్లోరైడ్ ద్రావణం పొగ రూపంలో బయటకు రావడంతో ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ ద్రావణం గాఢతను తగ్గించడానికి ఫైర్ ఇంజన్‌ను రప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



ఆనాటి గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మధిర: మధిర పట్టణంలో జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ మొదటి బ్యాచ్ 1970–71 చదివిన వారు ఆదివారం కోనస్ వీ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఆనాడు చదువుకున్న తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. 72 మందికి గనాను 60 మందికిపైగా హాజరయ్యారు.

# తాగునీటిలో విషప్రయోగం

నీరు సేవించిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



రామోజీ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



రామోజీ (ఫైల్)

తిరుమలాయపాలెం: కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తున్న రైతుని అంతమొందించేందుకు తాగునీటిలో విషం కలిపి హత్య చేసిన ఘటన మండలంలోని సోలీపురం శివారు పీక్యాతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోతు రామోజీ (59) కాకరవాయి గ్రామంలో ఓ రైతు భూమిని కౌలుకి తీసుకున్నాడు. రామోజీ పక్కనే ఇదే తండాకు చెందిన బానోతు రవి మరో రైతు భూమిని అధిక ధరకు కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో రామోజీ చేస్తున్న భూమిని కౌలుకి తీసుకునేందుకు కుట్ర పన్నాడు. కొన్నిసార్లు వివాదాలు కూడా చోటుచేసుకున్నాయి. గత నెల (ఫిబ్రవరి) 12న రామోజీ చేను వద్ద తాగు నీటి క్యాన్‌ని పెట్టుకోగా ఎలాంటి అనుమానం రాకుండా రవి విషం కలిపాడు. ఇది గమనించని రామోజీ ఆ నీటిని సేవించి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా విషం కలిపిన నీటిని సేవించినట్లు గుర్తించి రామోజీ కుమారుడు కొందరు అనుమానితులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బానోత్ రవిపై అనుమానం వచ్చి పోలీసులు విచారించగా తాగునీటిలో విషం కలిపింది తానేనని ఒప్పుకున్నాడు. చికిత్స పొందుతున్న రామోజీ శనివారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో పీక్యాతండాలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోవడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయగా అంత్యక్రియలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కూచిపూడి జగదీశ్ తెలిపారు.

## బస్సు, కారుడ్రైవర్ పరస్పర దాడులు

పాల్వంచరూరల్: బస్సు, కారు ఢీకొనడంతో రెండు వాహనాల డ్రైవర్లు ఒకరిపైఒకరు దాడులు చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పెద్దమ్మగుడి వద్ద బీసీయం జాతీయ రహదారిపై భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కారుకు రాసుకపోయింది. దీంతో కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతినడంతో కారుడ్రైవర్ నవీన్ బస్సుడ్రైవర్ రమేశ్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో పరస్పరం దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇద్దరు డ్రైవర్లు ఫిర్యాదు చేశారని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ సతీశ్ వెల్లడించారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు

దుమ్ముగూడెం: మండలంలోని జడ్.వీరభద్రారం గ్రామానికి చెందిన కొమరం రాముడు కనిపించకుండా పోయిన ఘటనపై ఎస్ఐ వెంకటప్పయ్య ఆదివారం కేసు నమోదు చేశారు. కొమరం రాముడు జడ్.వీరభద్రారం గ్రామంలో ఈ నెల 11వ తేదీన జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరయ్యాడు. వివాహం అనంతరం అతను కనిపించకపోవడంతో అతని భార్య లక్ష్మీదేవి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# అటవీ ప్రాంత అభివృద్ధికి రూ.30.47 కోట్లు

'కంపా' నిధులకు ప్రతిపాదనలు సిద్ధం

పాల్వంచరూరల్: అంతరించిపోతున్న అడవుల పునరుద్ధరణతో పాటు అటవీ ప్రాంత సంరక్షణ, అభివృద్ధి కోసం మంజూరయ్యే 'కంపా' నిధులపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించారు. ఈ నిధుల ద్వారా అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీరు అందేలా సాసర్‌పిట్లు, సోలార్ పంపుసెట్లు, నీటికుంటలు, చెక్‌డ్యామ్‌లు, సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణం, భూగర్భ జలాల పెంపు కోసం కందకాల తవ్వకం, బేస్‌క్యాంప్ సిబ్బంది జీతభత్యాలు, నర్సరీల ఏర్పాటు, ప్లాంటేషన్ నిర్వహణకు ఈ నిధులు వెచ్చిస్తారు. కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కాంపా) ద్వారా రానున్న ఆర్థిక సంవత్సరానికి (2025–26)కి గాను రూ.34.47 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) కోసం రూ.100.57 కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే రూ.30.62 కోట్లు మంజూరయ్యాయి. దీంతో రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.30.47 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపారు. ఈ విషయమై డీఎఫ్ఓ కృష్ణాగౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, వైల్డ్‌లైఫ్ ఆరు డివిజన్లను కలిపి అభివృద్ధి పనులు, నిర్వహణ వ్యయానికి కావాల్సిన 'కాంపా' నిధులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఈ నిధులను అటవీ డివిజన్ల పరిధిలో అభివృద్ధి పనులకు వెచ్చించనున్నామని వివరించారు.

## పూరిల్లు దగ్ధం

మణుగూరురూరల్: మండలంలోని సాంబాయిగూడెంలో పోలిపాక గిరిబాబుకు చెందిన పూరిల్లు ఆదివారం అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. గిరిబాబు పూరింట్లో మంటలు వ్యాపించడంలో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ క్రమంలో ఇంట్లో విలువైన సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం కలిగిందని, తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరారు.

# నాడు కళ .. నేడు వ్యథ !

పచ్చని ఆకులు, పలు రకాల పూలతో ఓ పల్లె ప్రకృతి వనం కొద్ది నెలల క్రితం వరకు కళకళలాడింది. ప్రస్తుతం అందులో వృక్షాలన్నీ ఎండి హరిత కళ మాయమైంది. అశ్వారావుపేట మండలం పాత మామిళ్లవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నాలుగేళ్ల క్రితం పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయగా, వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ మొక్కలు ఏపుగా పెరిగి మూడు నెలల క్రితం పచ్చని ఆకులు, వివిధ రకాల పుష్పాలతో ఆహ్లాదాన్ని పంచాయి. ఇటీవల ఎండలు పెరగడంతో పచ్చదనం మాయమై మొక్కలన్నీ మోడువారి కనిపిస్తున్నాయి.

– అశ్వారావుపేటరూరల్



కొద్ది నెలల క్రితం పచ్చని ఆకులు, పుష్పాలతో ఆహ్లాదభరితంగా ఉన్న పల్లె ప్రకృతి వనం



ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయి మోడు వారిన ప్రకృతి వనం

# డీఎస్పీ జవహర్‌లాల్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: ప్రజలకెంతో సేవ చేసే మంచి అధికారిని కోల్పోవడం తీరని లోటు అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, విత్తన, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సోదరుడు డీఎస్పీ జవహర్‌లాల్ సంతాపసభ ఆదివారం మండలంలోని ఆయన స్వగ్రామం ఈర్లపుడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసిన వారు మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ వై.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే మదనలాల్, లింగాల కమల్‌రాజు, గుండాల కృష్ణ, నాగండ్ల కోటేశ్వరరావు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బచ్చు విజయ్ కుమార్, గుత్తా రవి, మెంటం రామారావు, చెరుకూరి ప్రదీప్, తాత వెంకటేశ్వర్లు, దయాకర్, మాటేటి కిరణ్, అబ్బాస్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, చిన్నా, శ్రీనివాస్, వాంకుడోత్ దీపక్, పుచ్చకాయల వీరభద్రం, పోటు లెనిన్, మల్లికార్జున్ రావు, బానోతు మంజుల, తనయ్‌రాదే, ఆకాంక్ష, రామకోటి, సుందర్‌లాల్, మంగీలాల్, మోతీలాల్, మణిలాల్ తదితరులు ఉన్నారు.

# ఆ మొక్కలూ ఆఫ్‌టైపే..

స్పందించని ఆయిల్ ఫెడ్ యాజమాన్యం



పామాయిల్ క్షేత్రంలో నరికేసిన ఆఫ్‌టైప్ మొక్క

దమ్మపేట: పామాయిల్ సాగులో కొన్ని మొక్కలు చనిపోగా, వాటి స్థానంలో ఆయిల్ ఫెడ్ నర్సరీ అందజేసిన మొక్కలు కూడా ఆఫ్‌టైప్ కావడంతో రైతులు నిర్ఘాంతపోతున్నారు. మండలంలోని జగ్గారం గ్రామానికి చెందిన రైతు చెలికాని సూరిబాబు తన కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న 30 ఎకరాల భూమిలో ఏడేళ్ల నుంచి పామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల కిందట తోటలో 50 మొక్కలు చనిపోగా, వాటి స్థానంలో ఆయిల్ ఫెడ్ నర్సరీ నుంచి తెచ్చిన కొత్త మొక్కలను నాటి, సాగు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మూడేళ్ల సాగు అనంతరం 50 మొక్కల్లో 30 మొక్కలు ఆఫ్‌టైప్‌కి చెందినవని తెలిసింది. ఈ మొక్కలకు ఎలాంటి గెలల కాపు లేకపోగా, వాటి సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం వృథాగా భావించిన రైతు, వాటిని నరకడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అసిస్టెంటు, ఉన్నతాధికారులు వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించే వరకు నరకవద్దని సూచించారు. రోజులు గడుస్తున్నా ఏ ఒక్క ఉన్నతాధికారి తోట సందర్శనకు వచ్చిందే లేదని రైతు వాపోతున్నాడు. ఈ ఆఫ్‌టైప్ మొక్కలతో రూ.లక్షల్లో రైతులకు నష్టం జరుగుతున్నప్పటికీ ఆయిల్‌ఫెడ్ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నాడు. ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, రైతులకు న్యాయం చేయాలని కోరారు.

# ఘనంగా పసుపు దంచే వేడుక



పుసుపుకొట్టే వేడుకలో పాల్గొన్న మహిళలు

24న శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం(గుట్ట)పై మార్చి 24వ తేదీన జరగనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ఆదివారం పసుపు దంచే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేశ్‌శర్మ, ఆరుట్ల ఫణిరాజాచార్యులు ఆధ్వర్యంలో సుమారు 800 నుంచి 1000 మంది మహిళలు పసుపుకొట్టి స్వామి వారి కల్యాణ తలంబ్రాలు కలిపారు. ఈ సందర్భంగా స్వామి కల్యాణ విశేషాలను తెలుపుతూ వీడియో టీజర్‌ను వికాస తరంగిణి జిల్లా అధ్యక్షురాలు దేవినేని రోజారమణి ఆవిష్కరించారు. ఈ నెల 22 జరగనున్న శ్రీనివాస గిరి సంకీర్తన కరపత్రాన్ని కంచర్ల భార్గవ్ – శ్రావ్య, బుగ్గవీటి ఫణీంద్రబాబు – విజయలక్ష్మి దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరుట్ల లక్ష్మణాచార్యులు, పసుమర్తి వెంకటేశ్వరరావు, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, లక్ష్మిరెడ్డి, వంకదారు నర్సింహకుమార్, బండి వెంకటేశ్వర్లు, కంతాల వెంకటేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, మిట్టపల్లి నర్సింహారావు, పురుషోత్తం, జమ్ముల సీతారామిరెడ్డి, రమేశ్, రాంజీఅంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగికదాడికి యత్నం: కేసు నమోదు

పాల్వంచ: తొమ్మిదేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పట్టణంలో నాలుగో తరగతి చదివే బాలికతో శనివారం రాత్రి అదేకాలనీకి చెందిన శివకుమార్ చాక్లెట్లు ఇస్తానంటూ తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం ఇంటి దాబా పైకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించడంతో బాలిక బయపడి తన కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. బాలిక తల్లి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**లైంగికదాడికి యత్నంపై కేసు**

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడిలో ఓ యువతిపై అదే గ్రామానికి చెందిన సమీప బంధువు లైంగికదాడికి యత్నించడంపై ఆదివారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తనపై లైంగికదాడికి యత్నించాడని యువతి తల్లితండ్రులకు తెలపడంతో వారు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్‌షరీఫ్ వెల్లడించారు.